సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 3 । జూలై । 2024



భీమవరంలో 'బుజ్జి' సందడి
కల్కి 2898 ఏడీ సినిమాలోని 'బుజ్జి' వాహనం భీమవరంలో సందడి చేసింది. ఏబీజీ సినిమాస్ మల్టీప్లెక్స్‌లో మంగళవారం ప్రదర్శనకు ఉంచారు. 8లో ▸



మత్స్యకార పథకాలతో ఉపాధి
మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధికి ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన సంజీవనిలా నిలుస్తోంది. పీఎంఎంఎస్‌వైలో సబ్సిడీపై పలు పథకాలు అందిస్తున్నారు. 8లో ▸



ఆగస్టులో శత వసంతోత్సవాలు
మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం స్థాపించి శతాబ్దం కావడంతో ఆగస్టులో శతవసంతోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

మావుళ్లమ్మ హుండీ ఆదాయం రూ.69.20 లక్షలు



శ్రీమావుళ్లమ్మ ఆలయంలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశంచౌక్): శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానంలో మంగళవారం హుండీ లెక్కింపు చేపట్టారు. 92 రోజులకు మొత్తం రూ.69,20,286 ఆదాయం రాగా, హుండీ ద్వారా 154 గ్రాముల బంగారం, 590 గ్రాముల వెండి వచ్చింది. దీంతో పాటు విదేశీ కరెన్సీ గణనీయంగా లభించింది. లెక్కింపులో ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్, ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ యాప్‌లోనే బిల్లులు చెల్లించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రజలు వినియోగించే విద్యుత్ బిల్లులను ఇకపై ఈపీడీసీఎల్ సంస్థకు చెందిన మొబైల్ యాప్‌లోనే చెల్లించాల్సి ఉంటుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేపీబీ నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ మార్గదర్శకాలను అనుసరించి ఇకపై ఫోన్‌పే, జీ పే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్‌లలో విద్యుత్ బిల్లులు చెల్లించడానికి కుదరదని చెప్పారు. గూగుల్ ప్లే స్టోర్‌లో ఈస్ట్రన్ పవర్ పేరుతో కనిపించే మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. తమ సంస్థ వెబ్‌సైట్ ఏపీ ఈస్టర్న్‌పవర్‌డాట్‌కామ్ వెబ్‌సైట్ ద్వారా బిల్లులు చెల్లించడానికి అవకాశం ఉంటుదన్నారు. తమ వెబ్‌సైట్‌లో ఫోన్‌పే, జీ పే, పేటీఎం, యూపీఐ యాప్‌ల ద్వారా చెల్లించవచ్చని తెలిపారు. వీటితో పాటు డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, వాలెట్స్, క్యాష్ కార్డులు వినియోగించి కూడా విద్యుత్‌బిల్లులు చెల్లించవచ్చన్నారు.

దూరవిద్య స్టడీ సెంటర్ల ఏర్పాటుకు ఆహ్వానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో దూరవిద్యా విధానంలో నిర్వహిస్తున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులకు సంబంధించి కొత్త స్టడీ సెంటర్ల ఏర్పాటుకు సార్వత్రిక విద్యాపీఠం అవకాశం కల్పించిందని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్, మున్సిపల్, ప్రైవేట్ యాజమాన్యాల్లోని హైస్కూళ్లు, జూనియర్ కళాశాలలు నూతన స్టడీ సెంటర్లకు దరఖాస్తు చేసుకోవడానికి వీలుగా వెబ్‌సైట్‌లో దరఖాస్తులను పొందుపరిచినట్లు వివరించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత సహాయ కేంద్రం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రభుత్వ మార్గదర్శకాలు విడుదల చేసిన నేపథ్యంలో ఆన్‌లైన్‌లో విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఏలూరులోని కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత సహాయ కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ నెల 10 వరకూ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. కళాశాల, కోర్సు ఎంపికను ఈ నెల 11 నుంచి 15 వరకూ ఆన్‌లైన్ చేసుకోవచ్చన్నారు. తమ కళాశాలలో బీఏ హిస్టరీ, బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ జువాలజీ, బీఎస్సీ మ్యాథ్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

ఉపాధి హామీ పథకంపై సోషల్ ఆడిట్

కాళ్ల: కాళ్ల మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో జరిగిన 17వ విడత సోషల్ ఆడిట్ ప్రజా వేదిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. సమావేశానికి ప్రొసీడింగ్ అధికారిగా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.ప్రభాకర రావు, భీమవరం క్లస్టర్ ఏపీడీ పి.సుజాత, జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి హాజరయ్యారు. మొత్తం 587 పనులుకూ వేతన రూపంలో రూ.4,57,69,475 మెటీరియల్‌గా రూ. 1,48,23,016 మొత్తం రూ. 6,05,92,491కు ఆడిట్ జరిగినట్లు స్పష్టం చేశారు.

పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

పోలవరం రూరల్: గోదావరి నదీ పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో గోదావరి నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన మంగళవారం నాటికి 26.290 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. దీంతో స్పిల్‌వేలోని 48 గేట్ల నుంచి దిగువకు నీరు చేరి నదీప్రవాహంలో కలుస్తోంది.

ఎట్టకేలకు డిగ్రీ ప్రవేశాలు

- రెండున్నర నెలల తరువాత షెడ్యూల్ విడుదల..
- యూనివర్సిటీల్లో పచ్చ బ్యాచ్‌ను చొప్పించాకే ప్రవేశాల ప్రకటన
- తొలిరోజు సర్వర్ల మొరాయింపు



ఏలూరు కోటదిబ్బలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డిగ్రీలో ప్రవేశాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థుల నిరీక్షణ ఫలించింది. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థుల ఎదురుచూపులకు తెరపడింది. డిగ్రీ ప్రవేశాలపై ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోకపోవడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. విద్యాసంవత్సరం ఆలస్యంగా ప్రారంభమైతే వచ్చే వేసవిలో కూడా కళాశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని విద్యార్థులు ఆందోళన చెందారు. సాధారణంగా ఇంటర్ ఫలితాలు వెలువడిన నెలలోపే డిగ్రీ ప్రవేశాలకు ప్రభుత్వాలు చర్యలు తీసుకునేవి. కూటమి ప్రభుత్వం విద్యారంగంపై తన మార్కు పెత్తనం చూపించడానికే విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటోందని విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు విమర్శించాయి. అయినా ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా డిగ్రీ ప్రవేశాలను ఆలస్యం చేసింది. ఎట్టకేలకు ప్రభుత్వం సోమవారం ప్రకటన విడుదల చేయడంతో విద్యార్థులు కుదుట పడ్డారు.

పచ్చ బ్యాచ్‌ను చొప్పించాకే ప్రకటన

వ్యవస్థలను మేనేజ్ చేయడంలో దిట్టగా రాజకీయ విశ్లేషకులు చెప్పే చంద్రబాబు అధికారం చేపట్టిన నాటి నుంచి తన పచ్చ బ్యాచ్‌ను అన్ని రంగాల్లోకి చొప్పించడం ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. విద్యా రంగంలో కూడా అస్మదీయులను రంగంలోకి దించడానికి ఇప్పటి వరకూ యూనివర్సిటీలను సజావుగా నడిపిస్తున్న ఉప కులపతులను, ఆచార్యులను తొలగించే ప్రక్రియ ప్రారంభించారు. యూనివర్సిటీలో ఇంతవరకూ ఉన్న వారిని వైఎస్సార్‌సీపీ అనుకూలురుగా ముద్ర వేసి వారిని పదవుల నుంచి తొలగిపోవాలని హుకుం జారీ చేశారు.

రెండున్నర నెలల తరువాత

ఇంటర్ ఫలితాలు ఏప్రిల్ 12న విడుదలయ్యాయి. అనంతరం జూన్‌లో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు కూడా వెల్లడయ్యాయి. అయినా ప్రవేశాలపై నూతన ప్రభుత్వం ప్రకటన విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. విద్యా సంవత్సరంలో దాదాపు నెల రోజులు కోల్పోయామని ఆందోళన చెందుతున్నారు.

ఏలూరు, పశ్చిమలో 60 వేల సీట్లు

ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మొత్తం 91 డిగ్రీ కళాశాలలు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఏలూరు జిల్లాలో 7 ప్రభుత్వ, 1 ప్రభుత్వ ఎయిడెడ్ అటానమస్, ఒక ప్రైవేట్ అటానమస్, 31 ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాలలు మొత్తం కలిపి 40 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో 4 ప్రభుత్వ, 2 ప్రభుత్వ అటానమస్, 4 ఎయిడెడ్ అటానమస్, ఒక ప్రైవేట్ అటానమస్ కళాశాలలున్నాయి. ఒక ప్రైవేట్ ఎయిడెడ్, 39 ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాలలు మొత్తం కలిపి 51 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. సుమారు 60 వేల సీట్లు అందుబాటులో ఉన్నాయి.

సర్వర్ల మొరాయింపుతో ఇక్కట్లు

తొలి రోజు వేలాది మంది తమ సమీపం లోని కళాశాలల్లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోడానికి వెళ్ళారు. మధ్యాహ్నం 12 గంటల వరకూ అసలు సైట్ ఓపెన్ కాకపోవడంతో ఆందోళన నెలకొంది. తరువాత ఓపెన్ అయినా.. సర్వర్లు మొరాయించాయి. తొలి రోజు సర్వర్ల మొరాయింపుతో ఎక్కువ మంది దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం లేక నిరాశకు గురయ్యారు.

ప్రవేశాల షెడ్యూల్ ఇలా..

2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ ప్రవేశాలకు ఉన్నత విద్యామండలి సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆర్ట్స్, సైన్స్, సోషల్ సైన్సెస్, కామర్స్, మేనేజ్‌మెంట్, కంప్యూటర్ అప్లికేషన్స్ అండ్ సోషల్ వర్క్, హానర్స్ వంటి కోర్సుల్లో సీట్లను భర్తీ చేయనున్నారు. ప్రభుత్వ, అటానమస్, ప్రైవేటు ఎయిడెడ్, ప్రైవేట్ అన్ ఎయిడెడ్, ప్రైవేట్ అటానమస్ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో ఆన్‌లైన్ ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ మేరకు జూలై 2 నుంచి 10 వరకు విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోవాలని సూచించింది. 5న కళాశాలల్లో ధ్రువపత్రాల పరిశీలన, 11 నుంచి 15 వరకు ఆప్షన్ల ఎంపికకు అవకాశం కల్పించింది. 19న తుది సీట్ల కేటాయింపు పూర్తిచేస్తారు. సీట్లు పొందిన విద్యార్థులు 20 నుంచి 22లోగా ఆయా కళాశాలల్లో రిపోర్టు చేయాలి. ప్రత్యేక కేటగిరీ విద్యార్థుల (దివ్యాంగులు, ఎన్‌సీసీ, గేమ్స్ అండ్ స్పోర్ట్స్, ఇతర కరిక్యులర్ యాక్టివిటీస్) సర్టిఫికెట్లను 4 నుంచి 6 వరకు పరిశీలించనున్నారు. ఈ ప్రత్యేక కేటగిరీ విద్యార్థులు విజయవాడలో ఎస్ఆర్ఆర్, విశాఖపట్నంలోని వీఎస్ కృష్ణ కళాశాల, తిరుపతిలోని ఎస్వీ వర్సిటీలో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావాలి. విద్యార్థుల ప్రవేశాలకు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో సైతం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశారు.

సాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సి.నా

భీమవరం (ప్రకాశంచౌక్): ఖరీఫ్ సాగులో నీటికి ఆటంకం లేకుండా అవసరమైన పనులను వెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్యతో కలిసి సాగునీటి పనులపై సమీక్షించారు. శివారు భూములకు సాగు నీటి ఎద్దడి ఏర్పడకుండా అవసరమైన పనులు వెంటనే చేపట్టాలన్నారు. కాలువల్లో, డ్రయిన్లలో నీటి ప్రవాహానికి అడ్డంకి లేకుండా గుర్రపు డెక్క, కిక్కిస తొలగింపు పనులను మొదటి దశలో చేపట్టాలన్నారు. తొలగించిన చెత్తను గట్ల మీద వేయకుండా దూరంగా తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తాడేపల్లిగూడెం, తణుకు, ఉండి, నరసాపురం సబ్ డివిజన్ల పరిధిలో లాకులు కొత్తవి అమరచడం, రిపేర్లు చేయడం వంటి 49 పనులకు సంబంధించి రూ.5.79 కోట్లకు ప్రతిపాదనలు పంపామని జలవనుల శాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ నీటిపారుదలకు ఆటంకంగా ఉన్న ప్రదేశాలను తొలుత గుర్తించి కిక్కిస, గుర్రపు డెక్క తొలగింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. పనుల నాణ్యత తగ్గకూడదని, ఖర్చు చేసే ప్రతి పైసా పూర్తి సద్వినియోగమయ్యేలా చేయాలని తెలిపారు.

అతిసారంపై అవగాహన కల్పించండి



అతిసారంపై అవగాహన ర్యాలీలో జిల్లా వైద్యాధికారి మహేశ్వరరావు

పాలకోడేరు: వర్షాకాలంలో తాగునీరు కలుషితం కావడం ద్వారా అతిసారం వచ్చే ప్రమాదం ఉందని, వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మహేశ్వరరావు అన్నారు. పాలకోడేరులో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చిన్నమిల్లి రంగమనాయుడు, వైద్యురాలు డాక్టర్ స్వర్ణ నిరంజని ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ ఈ సీజన్‌లో ఐదేళ్ల లోపు పిల్లలకు అతిసారం సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీరు తాగడం ద్వారా అతిసారం నుంచి విముక్తి పొందవచ్చన్నారు. ఎవరికైనా వాంతులు విరోచనాలు అవుతుంటే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని అన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

రూ.4,408 కోట్ల పంపిణీ



పాలకొల్లులో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల

పాలకొల్లు అర్బన్: రాష్ట్రంలో 65.18 లక్షల మంది పింఛన్ లబ్ధిదారులకు రూ.4,408 కోట్లు సచివాలయ ఉద్యోగుల ద్వారా కేవలం ఒక్కరోజులోనే 95 శాతం పంపిణీ చేసినట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. పాలకొల్లులో తన కార్యాలయంలో మంగళవారం మంత్రి విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 2,32,885 మందికి రూ.97.69 కోట్లు పంపిణీ చేసినట్లు ఆయన చెప్పారు. సచివాలయ ఉద్యోగుల ద్వారా నేరుగా పింఛన్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేసే వ్యవస్థ ఉందన్నారు. ఒక్క రోజులోనే పింఛన్లు పంపిణీ చేసిన సచివాలయ ఉద్యోగులను మంత్రి రామానాయుడు అభినందించారు. సమావేశంలో టీడీపీ నాయకులు పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు పట్టిసీమ నుంచి నీటి విడుదల

ఏలూరు(మెట్రో): పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి జూలై 3న ఉదయం 7:27కు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సాగునీరు విడుదల చేస్తారని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ముందుగా 1000 క్యూసెక్కుల నీరు పోలవరం కుడి కాలువ ద్వారా సరఫరా చేస్తారని, తరువాత కృష్ణా డెల్టా అవసరాలకు 8,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నట్లు చెప్పారు.

జీజీహెచ్‌లో వైద్యుల కొరత

- తాజాగా ఐదుగురు వైద్య నిపుణుల బదిలీ
- వైద్యం కోసం రోగుల నిరీక్షణ



ఏలూరు సర్వజన ఆసుపత్రి

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రిలో నిపుణులైన వైద్యుల కొరతతో రోగులకు కష్టాలు తప్పేలా లేవు. ప్రాణాపాయ స్థితిలో విజయవాడ, గుంటూరు వంటి దూర ప్రాంతాల్లోని హాస్పిటల్స్‌కు పరుగులు పెట్టాల్సిందే. పేద ప్రజలు కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వంలో కొందరు నిపుణులైన వైద్యులను డిప్యుటేషన్‌పై నియమించి పేదలకు వైద్య సేవలు సక్రమంగా అందించగా, తాజాగా వైద్య నిపుణులను బదిలీ చేయటంతో మెరుగైన వైద్యసేవలు కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడింది. మంగళవారం ఏలూరు జీజీహెచ్‌లో వైద్యుల కొరతతో పలు విభాగాల వద్ద రోగులు వైద్యం కోసం పడిగాపులు పడ్డారు.

వైద్య నిపుణుల బదిలీ

ఏలూరు జీజీహెచ్‌లో జనరల్ సర్జన్‌గా సీనియర్ వైద్య నిపుణుడు డాక్టర్ పోతుమూడి శ్రీనివాసరావు, జనరల్ సర్జన్, వైద్య నిపుణుడు డాక్టర్ బి.రవికుమార్, చిన్న పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ పీఏఆర్ఎస్ శ్రీనివాస్, సీనియర్ గైనకాలజీ వైద్య నిపుణురాలు డాక్టర్ జే.లిటోర్నా దేవి, సీనియర్ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ ఏఎస్ రామ్‌లను బదిలీ చేస్తున్నట్లు హాస్పిటల్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు జిల్లా కేంద్ర ఆసుపత్రి గత ప్రభుత్వం హయాంలో మెడికల్ కళాశాల మంజూరు కావటంతో బోధనాసుపత్రిగా మారింది. మెడికల్ కళాశాలకు అనుబంధంగా బోధనాసుపత్రి ఏర్పాటుతో వైద్యవిధాన పరిషత్‌కు చెందిన పలువురు వైద్య నిపుణులను గతంలో బదిలీ చేశారు. పూర్తిస్థాయిలో ఏలూరు సర్వజన ఆసుపత్రిగా అభివృద్ధి చెందుతోన్న దశలో కొందరు వైద్య నిపుణులను డిప్యుటేషన్‌పై ఏలూరు జీజీహెచ్‌లో కొనసాగిస్తున్నారు.

రోగులకు ప్రభుత్వ వైద్యం దూరం

జీజీహెచ్‌లో మొత్తం మంజూరైన వైద్య నిపుణుల పోస్టులు 78 ఉండగా, ప్రస్తుతం 34 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. రోజూ ఏలూరు జీజీహెచ్ ఓపీకి జిల్లా వ్యాప్తంగా 1000 నుంచి 1200 మంది వరకూ వస్తుంటారు. ట్రామా కేర్, అత్యవసర వైద్యవిభాగం, ఐసీయూ వంటి ప్రత్యేక విభాగాల్లో 50 మంది వరకూ రోగులు ప్రత్యేక చికిత్స పొందుతూ ఉంటారు. జనరల్ మెడిసిన్‌కు సంబంధించి పోతుమూడి శ్రీనివాసరావు, జనరల్ సర్జన్ వైద్య నిపుణులు రవికుమార్ కీలకంగా ఉంటూ రోగులకు సేవలు అందిస్తున్నారు. గైనకాలజీ, చిన్న పిల్లలు, కంటి వైద్య విభాగంలోనూ వైద్యుల కొరత ఏర్పడే పరిస్థితులు నెలకొన్నాయి. ఆసుపత్రి ఉన్నతాధికారి వ్యవహారశైలిపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సీనియర్ వైద్య నిపుణులను సైతం చులకనగా మాట్లాడడమే కాకుండా, వేధింపులకు గురిచేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. హాస్పిటల్ అభివృద్ధిపై దృష్టి సారించకుండా కేవలం హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు, వైద్య నిపుణులపై పెత్తనం చేసేందుకే హాస్పిటల్ అధికారి ప్రాధాన్యత ఇస్తారనే అపవాదు ఉంది.

ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో శ్రీసాయి



కొమ్మూరి షణ్ముఖ

గణపవరం: గణపవరానికి చెందిన కొమ్మూరి షణ్ముఖ శ్రీసాయి ఇండియన్ బుక్ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు. సైబర్ సెక్యూరిటీ, ఇంటర్‌నెట్‌లో సైబర్ దాడులు గుర్తించి వాటికి పరిష్కారాలు తెలియజేయడం వంటివి విజయవంతంగా నిర్వహించినందుకు ఈ గౌరవం దక్కింది. గత ఆరు నెలల్లో ఐజీసీఏఆర్, ఐఐటీ బెంగుళూరు, ఐఐటీ ముంబై, ఐఐటీ మద్రాస్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన వెబ్‌సైట్, ఆంధ్రప్రదేశ్ పోలీసుశాఖ సైట్స్, 50 ప్రముఖ కంపెనీలలో ఉన్న లోపాలను గుర్తించి, వాటికి పరిష్కారాలు చూపినందుకు ఈ గౌరవం దక్కింది. ఇతర దేశాలలోని 40కి పైగా సంస్థలలో ఉన్న లోపాలను గుర్తించి ఆ సంస్థలకు తెలియజేశాడు. ఇసి కౌన్సిల్–2024లో ప్రపంచ దేశాలలో ఉన్న హాకర్స్ జాబితాలో శ్రీసాయి తొమ్మిదో స్థానంలో నిలిచాడు. త్వరలో ఢిల్లీలో ప్రారంభం కానున్న కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే సైబర్ రీసెర్చింగ్ సమ్మిట్‌కు శ్రీసాయికి ఆహ్వానం అందింది.

కొత్త ఆవిష్కరణలతో ఉద్యోగ అవకాశాలు



వర్క్‌షాపులో మాట్లాడుతున్న ఏఐ నిపుణుడు ఉమా దేసు

భీమవరం (ప్రకాశంచౌక్): విద్యార్థులు నూతన టెక్నాలజీని అధ్యయనం చేసి ఇన్నోవేటివ్ ఆవిష్కరణలు చేస్తేనే ఉద్యోగ అవకాశాలు వస్తాయని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిపుణుడు ఉమా దేసు పేర్కొన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐ మిషన్ లెర్నింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఐదు రోజులు జరిగే వర్క్ షాప్ మంగళవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ఏఐఎంఎల్ హెడ్ డాక్టర్ జీఎస్‌ఎన్‌వీజీ శిరీష అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉమా దేసు మాట్లాడుతూ కొట్లాది ఉద్యోగ అవకాశాలు ఏఐ రంగంలో లభిస్తాయని చెప్పారు. హైదరాబాద్ ట్రిబుల్ ఐటీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఇంజనీర్ పి.భాస్కరరావు మాట్లాడుతూ నూతన టెక్నాలజీని విద్యార్థులు అందుకుంటేనే భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ మార్పులకు అనుగుణంగా అధ్యాపకులు, విద్యార్థులు తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు.

హైవే విస్తరణ కలేనా!

- రెండున్నర దశాబ్దాలుగా ఎన్‌హెచ్–165కు దొరకని మోక్షం
- మళ్లీ రూ.1500 కోట్లతో ప్రతిపాదనలు
- కేంద్ర మంత్రి చొరవ చూపాలంటున్న స్థానికులు



అధ్వానంగా ఉన్న జాతీయరహదారి–165

ఆకివీడు: డెల్టా ప్రాంతంలో కీలకమైన జాతీయరహదారి–165 ప్రయాణికులకు చుక్కలు చూపిస్తోంది. అటు అభివృద్ధికి నోచుకోక, ఉన్న రోడ్డు పాడవడంతో జనం తంటాలు పడుతున్నారు. పామర్రు–పాలకొల్లు(పీపీ) రోడ్డును 1990లో ఎన్‌హెచ్‌లో విలీనం చేసేందుకు ప్రతిపాదించగా, 2001లో జాతీయరహదారిగా కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. మొదట్లో పామర్రు నుంచి కత్తిపూడి వరకూ జాతీయ రహదారి ఏర్పాటు చేసి 214గా గుర్తించారు. అనంతరం ఈ రోడ్డును కత్తిపూడి నుంచి నరసాపురం, పెడన, మచిలీపట్నం, బాపట్ల, చీరాల మీదుగా ఒంగోలు వరకూ ఎన్.హెచ్ 216గా మార్చారు. అనంతరం పామర్రు–పాలకొల్లు(పీపీ)రోడ్డుగా ఉన్న జాతీయ రహదారిని 165గా గుర్తించి హైవే–216కు నర్సాపురం వద్ద, హైవే–65కు పామర్రు వద్ద అనుసంధానం చేశారు. పామర్రు నుంచి దిగమర్రు వరకూ రూ.4200 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి, జాతీయ రహదారుల శాఖ టెండర్లు పూర్తి చేసింది. అయినా పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడ అన్నట్లే ఉన్నాయి. ఏడేళ్ల క్రితం కేంద్ర మంత్రి గడ్కరీ ఆకివీడులోని జెడ్పీ స్కూల్ వద్ద హైవే పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి నేటి వరకూ రహదారి పనులు అంగుళం కదలలేదు. కృష్ణా పామర్రు నుంచి పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు–ఉప్పుటేరు వరకూ ఒక టెండర్, ఆకివీడులోని జానకమ్మ ఆసుపత్రి నుంచి దిగమర్రు వరకూ మరో టెండర్ పూర్తయింది. కృష్ణా జిల్లా ప్రాంతంలో పనులు వేగంగా జరిగి, దాదాపు పూర్తి కావస్తున్నా, పశ్చిమ గోదావరి జిల్లాలో పనులు ప్రారంభించలేదు. ఈ ప్రాంతంలో పనుల కోసం ఎన్‌హెచ్ శాఖ రూ.1500 కోట్లతో మళ్లీ ప్రతిపాదనలు పంపింది.

భూ సేకరణకు లైన్‌క్లియర్ : ఆకివీడు నుంచి దిగమర్రు వరకూ పలు చోట్ల బైపాస్ రోడ్ల నిర్మాణం కోసం భూ సేకరణ పనులు ప్రారంభమయ్యాయి. కోర్టు క్లియరెన్స్‌తో ప్రస్తుతం రెవెన్యూ అధికారులు ఆయా ప్రాంతాల్లోని భూ సేకరణకు రైతుల నుంచి ల్యాండ్ టైటిలింగ్ వివరాలు సేకరించారు. ఆకివీడు, ఉండి ఎన్నార్పీ అగ్రహారం, భీమవరంలోని కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ రోడ్డు, విస్సాకోడేరు, పెన్నాడ, శృంగవృక్షం, వీరవాసరం మీదుగా భగ్గేశ్వరం, లంకలకోడేరు, దిగమర్రు వరకూ బైపాస్ రోడ్ల నిర్మాణం జరగనుంది. ఆయా ప్రాంతాల్లో భూ సేకరణకు మార్కింగ్ పూర్తయింది.

కేంద్ర మంత్రిపైనే ఆశలన్నీ..

జాతీయ రహదారి–165 సగభాగం పశ్చిమగోదావరి జిల్లాలోని నర్సాపురం పార్లమెంట్ పరిధిలోనే ఉంది. సుమారు 40 కిలోమీటర్ల మేర ఈ ప్రాంతంలో జాతీయ రహదారి ఉంది. నర్సాపురం ఎంపీలుగా రెండు పర్యాయాలు బీజేపీకి చెందిన అభ్యర్థులు గెలుపొందారు. అయినా పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుత ఎంపీ భూపతిరాజు శ్రీనివాస వర్మ కేంద్రంలో మంత్రిగా ఉన్నారు. ఇప్పుడైనా ఈ జాతీయ రహదారి అభివృద్ధి చెందుతుందని ప్రజలు ఆశిస్తున్నారు. ఉండి ఆర్వోబీ నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అదే విధంగా ఉప్పుటేరుపై బైపాస్ వంతెన నిర్మాణం కూడా నిలిచిపోయింది.

ఆర్వోబీలు, పలు వంతెనల నిర్మాణం



ఆర్వోబీ దుస్థితి

బైపాస్ రోడ్లకు అనుగుణంగా పలు చోట్ల ఆర్వోబీలు, వంతెనల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఉండి, భీమవరం, పాలకొల్లు, దిగమర్రు ప్రాంతాల్లో, పలు చోట్ల మూడు పెద్ద వంతెనలు, అవసరమైన ప్రాంతాల్లో అనేక కల్వర్టులు, చిన్న వంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించారు. ప్రతిపాదనల్ని గత ఏడాది డిసెంబర్‌లో జాతీయ రహదారుల శాఖకు పంపారు.

క్లుప్తంగా

పెట్రోలు పోసి మహిళపై హత్యాయత్నం

పాలకొల్లు అర్బన్: వివాహేతర సంబంధం నేపథ్యంలో తన కొడుకుకి జనన ధ్రువీకరణ పత్రంపై సంతకం పెట్టమని కోరిన మహిళపై ఓ వ్యక్తి పెట్రోలు పోసి హత్య చేసేందుకు ప్రయత్నించాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చింతపర్రులో బీసీ కులానికి చెందిన బత్తిన నాగమునీంద్ర అదే గ్రామంలో ఎస్సీ కులానికి చెందిన నీతిపూడి రిబ్కాతో గత కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో వీరికి ఒక కుమారుడు కలగగా, ఆ బిడ్డ ప్రస్తుతం స్థానికంగా ఉన్న పాఠశాలలో 2వ తరగతి చదువుతున్నారు. అయితే తన కుమారుడుకి పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రంపై సంతకం పెట్టాలని నాగమునీంద్రను గత కొన్నిరోజుల నుంచి రిబ్కా అడుగుతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం అదే విషయంపై రిబ్కా నిలదీయడంతో నాగమునీంద్ర ఆగ్రహంతో ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించే ప్రయత్నం చేశాడు. దీంతో నాగమునీంద్ర, రిబ్కాలకు కాలిన గాయాలయ్యాయి. ఇద్దరిని పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నిమిత్తం స్థానికులు చేర్పించారు. రిబ్కా ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై డి హరికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు పూలపల్లిలో ఆక్వా రైతుల రాష్ట్ర మహాసభ

పాలకొల్లు సెంట్రల్: జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం పూలపల్లిలో రాష్ట్ర ఆక్వా రైతుల మహాసభ నిర్వహించనున్నట్లు జై భారత్ ఆక్వా సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు చెప్పారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆక్వా సాగు అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటోందని, రైతులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారని, దీనిపై చర్చించడానికి రాష్ట్ర వ్యాప్తంగా ఆక్వా రైతుల మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు పాలకొల్లు మండలం పూలపల్లి గ్రామంలో పూలపల్లి–ఆగర్రు రోడ్డులో ఉన్న ఎస్ఎస్ఎస్ కల్యాణ మండపంలో ఆక్వా రైతు మహాసభ ఏర్పాటు చేశామన్నారు. ఆక్వా రైతుల భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకోవడానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆక్వా రైతులందరూ హాజరవ్వాలని పిలుపునిచ్చారు. ఆక్వా రైతు సంఘం కార్యదర్శి బోణం వెంకటనర్సయ్య (చినబాబు) పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పోడూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పెనుమదం గ్రామానికి చెందిన మాజీ వార్డు మెంబర్ కుసుమె జయరాజు (53) గత నెల 24న ద్విచక్రవాహనంపై గుమ్మలూరు వెళుతుండగా, రెల్లివారిపేట వద్ద అదుపుతప్పి పడిపోవడంతో తలకు తీవ్రగాయమైంది. స్థానికులు పాలకొల్లు తీసుకువెళ్లగా మెరుగైన వైద్యం కోసం భీమవరంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

మత్స్యకార పథకాలతో ఉపాధి

- పీఎంఎంఎస్‌వై ద్వారా లబ్ధిదారులకు సబ్సిడీపై రుణాలు
- ఉమ్మడి పశ్చిమలో ఆక్వా రైతులకు మెరుగైన అవకాశాలు
- ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం, బీసీ, ఓసీలకు 40 శాతం సబ్సిడీ
- ఈ ఏడాది 18 రకాల పథకాల అమలుకు అధికారుల కసరత్తు



కైకలూరులో ఓ చెరువులో ఏరియేటర్లను తిప్పుతున్న దృశ్యం, అంతరచిత్రంలో చేపలను ప్యాకింగ్ చేస్తున్న కూలీలు (ఫైల్)

కై కలూరు: మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధికి ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) సంజీవనిలా నిలుస్తోంది. దేశంలోనే ఆక్వా ఉత్పత్తులలో అగ్రగామిగా నిలుస్తున్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మత్స్యకారులు, ఆక్వా రైతులు, నిరుద్యోగ యువతీ యువకులకు పీఎంఎంఎస్‌వై పథకాలు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. ఉమ్మడి పశ్చిగోదావరి జిల్లాలో 2.70 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు విస్తరించి ఉంది. ఏలూరు జిల్లా నుంచి ఏటా 3.5 లక్షల టన్నుల రొయ్యలు ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ప్రతి ఏటా ఆక్వా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఇటువంటి పరిస్థితులో పీఎంఎంఎస్‌వై ద్వారా ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం, బీసీ, ఓసీలకు 40 శాతం సబ్సిడీపై పలు పథకాలను ఈ ఏడాది అందించనున్నారు.

పథకాల వివరాలు ఇలా..

మంచినీటి హెచరీ ద్వారా దానుస్, మాగుర్, తిలపియా, మైనర్ కార్ప్, ఆర్నమెంటు సాగు నిమిత్తం రూ.25 లక్షలు, బయోఫ్లాక్ పాండ్స్ – మంచినీటి చెరువులకు రూ.14 లక్షలు, రీసర్క్యులేటరీ – ఆక్వా కల్చర్ సిస్టం (పెద్దది) రూ.50 లక్షలు, ఎస్టాబ్లిష్‌మెంట్ ఆఫ్ డిసీస్ డయాగ్నసిస్ అండ్ క్వాలిటీ టెస్టింగ్ ల్యాబ్ రూ.25 లక్షలు, మొబైల్ ఆక్వా ల్యాబ్ రూ.35 లక్షలు, ఎస్టాబ్లిష్‌మెంట్ న్యూ ఫ్రెష్‌వాటర్ స్కాంపి హెచరీ రూ.50 లక్షలు, కన్‌స్ట్రక్షన్ ఆఫ్ న్యూ గ్రోఅవుట్ పాండ్స్ రూ.7 లక్షలు, రీసర్క్యులేటరీ – ఆక్వా కల్చర్ సిస్టమ్ (మీడియం) రూ.25 లక్షలు, ఫ్రెష్ వాటర్ అర్నమెంటల్ ఫిష్ ఇంటిగ్రేటెడ్ బ్రీడింగ్ అండ్ రేరింగ్ రూ.25 లక్షలు, ఫ్రెష్ వాటర్ ఆర్నమెంటల్ ఫిష్ బ్రూడ్ బ్యాంకు రూ.కోటి, కోల్డ్ స్టోరేజ్ (10 టన్నులు) – రూ.40 లక్షలు, కోల్డ్ స్టోరేజ్ (20 టన్నులు) – రూ.80 లక్షలు, కోల్డ్ స్టోరేజ్ (30 టన్నులు) – రూ.1.20 కోట్లు, కోల్డ్ స్టోరేజ్ (50 టన్నులు) – రూ.1.50 కోట్లు, ఫిష్ వాల్యుయాడెడ్ యూనిట్ రూ.50 లక్షలు, కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫిష్ కియోస్క్ ఆక్వేరియం, ఆర్నమెంటల్ – రూ.10 లక్షలు తదితర పథకాలను ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం, బీసీ, ఓసీలకు 40 శాతం సబ్సిడీపై అందిస్తారు. అదే విధంగా ప్రీప్రాసెసింగ్ యూనిట్ రూ.6.39 కోట్లు, ప్రాసెసింగ్ యూనిట్ రూ.40 కోట్లను 20 శాతం సబ్సిడీతో అందిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



కేంద్ర ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. రుణ రాయితీలను కల్పిస్తోంది. ప్రధానంగా కొల్లేరు పరివాహక ప్రాంతాల్లో వేలాది కుటుంబాలు ఆక్వా సాగుపై ఆదారపడి జీవిస్తున్నారు. ఆక్వా రైతులు, నిరుద్యోగ యువతీ యువకులకు ఈ పథకాలు ఉపాధి మార్గాలను చూపుతాయి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఇతర వివరాల కోసం స్థానిక మత్స్యశాఖ అభివృద్ధి అధికారులను సంప్రదించాలి.

– ఎస్‌కే.చాన్‌బాషా, మత్స్యశాఖ సహాయ సంచాలకులు, కైకలూరు.

విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలి



హెచ్‌ఎంకు నోటీసు ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఐక్య విద్యార్థి సంఘాల పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఈ నెల 4వ తేదీన నిర్వహించే విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. బంద్‌కు సహకరించాలని కోరుతూ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంకు మంగళవారం నోటీసు అందజేశారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు రూప శంకర్, జిల్లా నాయకులు శ్రీను, ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు నాగేంద్ర, కార్యదర్శి రవి మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జాతీయ స్థాయి పరీక్షలు నిర్వహించడంలో విఫలమైందన్నారు. బాధ్యతా రహిత్యంతో పరీక్షలు జరిపినట్లు విమర్శించారు. నీట్ పరీక్ష లీకేజీ తెర వెనుక పెద్ద కుంభకోణం ఉందన్నారు. నీట్, పీజీ పరీక్షలు 12 గంటల ముందు వాయిదా వేయడం, యూజీసీ నెట్ పరీక్ష రద్దు చేయడంతో విద్యార్థులలో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. స్కాంలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన విద్యను అందించడంలో ఎన్డీఏ ప్రభుత్వం విఫలమైందన్నారు. పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వడ్డి కులస్తుల ఐక్యతే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ నాయకులు

పెంటపాడు: వడ్డి కులస్తుల పరిరక్షణకు ప్రతి సంఘస్తుడు పాటు పడాలని ఆ సంఘ రాష్ట ఐక్య వేదిక కన్వీనర్ పేరూరి సత్యనారాయణ కోరారు. ఆ సంఘ సమావేశం తాడేపల్లిగూడెంలో సంఘ సభ్యుడు ముత్యాల నగేష్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముత్యాల నగేష్, ఖండవల్లి గంగరాజు, పెంటపాటి శేషగిరి రావు, నిడదవోలు రామకృష్ణ, రాజా ధనరాజు, రాజా గురునాథం, గణపవరం, దువ్వ కన్వీనర్‌గా ఎన్నికైనట్లు సత్యనారాయణ తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి హాజరై తమ సమస్యలను చర్చించుకున్నారు. రాష్ట్రంలో రెండు లక్షలుపైగా ఉన్న వడ్డీ కులస్తులను ప్రభుత్వాలు గుర్తించి నామినేటడ్ పోస్టులలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో వడ్డీలను ఐక్యం చేసేందుకు ప్రతి నియోజకవర్గంలో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సంఘ సత్యనారాయణ తెలిపారు.

అల్లూరిని ఆదర్శంగా తీసుకోవాలి



రాజ్యాంగ సంకలనం పుస్తకాలను అందజేస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ రాము సూర్యారావు అన్నారు. అల్లూరి 127వ జయంతి సందర్భంగా బాలోత్సవ కమిటీ కన్వీనర్, బహుజన ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు దేవరకొండ వెంకటేశ్వర్లు, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావుతో కలిసి రాము సూర్యారావు మంగళవారం నగరంలోని స్కూల్స్, కళాశాలలను సందర్శించారు. 4న విద్యాసంస్థల బంద్ కారణంగా అల్లూరి జయంతి వారోత్సవాల సభలు ఈ నెల 3 లేదా 5వ తేదీన జరుపుతామని తెలిపారు. విద్యార్థులకు అల్లూరి జీవితంపై డ్రాయింగ్, ఏకపాత్రాభినయం, వేషధారణ, ఉపన్యాసం పోటీలు ఏర్పాటు చేయాలని కోరారు. దేవరకొండ వెంకటేశ్వర్లు, గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ ఏలూరు పరిసర ప్రాంతాల్లో 127 చోట్ల 3, 4, 5 తేదీల్లో నిర్వహించే సభలకు అందరూ సహకరించాలని కోరారు. వెంకటేశ్వర్లు రూపొందించిన భారత రాజ్యాంగ సంకలనం పుస్తకాలు అన్ని విద్యాలయాల ప్రిన్సిపాల్స్, హెచ్‌ఎంలకు అందజేశారు.

భీమవరంలో 'బుజ్జి' సందడి

ప్రభాస్ నటించిన కల్కి 2898 ఏడీ సినిమాలోని 'బుజ్జి' వాహనం భీమవరంలో సందడి చేసింది. భీమవరం కోస్టల్ సిటీ సెంటర్ (ఏవీజీ సినిమాస్ మల్టీప్లెక్స్)లో మంగళవారం ప్రదర్శనకు ఉంచిన బుజ్జి వాహనాన్ని కోస్టల్ సిటీ సెంటర్ మేనేజర్ శివరామరాజు, ఏవీజీ సినిమాస్ మేనేజర్ మధు ప్రారంభించారు. ఈ వాహనాన్ని చూసేందుకు అభిమానాలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అభిమానులు బుజ్జి వాహనాన్ని సెల్ఫీలో బంధించుకున్నారు. దర్శకుడు నాగ్ అశ్విన్ కొత్త ఆలోచనతో మహీంద్రా కంపెనీ సహకారంతో ఈ బుజ్జి వెహికల్‌ని సుమారు రూ.6 కోట్లు ఖర్చుపెట్టి తయారుచేశారు. సినిమాలో బుజ్జి చేసే యాక్షన్ సీన్స్ అందరిని మెప్పించాయి.

– భీమవరం (ప్రకాశంచౌక్)



బుజ్జి వాహనం



భీమవరంలో బుజ్జి వాహనాన్ని చూసేందుకు తరలివచ్చిన అభిమానులు

ఆశ్రం ఆస్పత్రి భవనం పైనుంచి దూకి రోగి ఆత్మహత్య



ఘటనా స్థలంలో సత్యనారాయణ మృతదేహం

ఏలూరు టౌన్: ఏలూరు శివారు ఆశ్రం ఆస్పత్రిలో వైద్యం నిమిత్తం వచ్చిన ఓ రోగి భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముసునూరు మండలం గుడిపాడుకు చెందిన వేమూరి సత్యనారాయణ (40) వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతనికి భార్య, కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా అతను లివర్ వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స నిమిత్తం ఈనెల 1న ఆశ్రం ఆసుపత్రిలో చేరాడు. వైద్యులు పరీక్షించి శస్త్రచికిత్స చేయాల్సి ఉందని చెప్పి ఆసుపత్రి వార్డులో ఉంచారు. మంగళవారం సంబంధిత వైద్య పరీక్షలు, స్కానింగ్ పూర్తి చేశారు. శస్త్ర చికిత్స చేయించుకునేందుకు భయపడుతూ ఇంటికి వెళ్లిపోదామని సత్యనారాయణ కుటుంబ సభ్యులతో చెప్పాడు. ఈ క్రమంలోనే భార్య, కుటుంబ సభ్యులు బయటకు వెళ్లిన సమయంలో సత్యనారాయణ తాను చికిత్స పొందుతున్న వార్డులో బాత్రూములోకి వెళ్లి అక్కడ కిటికీలో నుంచి కిందకు దూకాడు. దీంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రూరల్ ఎసై రాజారెడ్డి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కొవ్వలిలో బాల్య వివాహం నిలుపుదల

ఏలూరు (టూటౌన్): కొవ్వలిలో ఓ బాలికకు వివాహం చేసే ప్రయత్నాలను అధికారులు మంగళవారం అడ్డుకుని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వివరాలిలా ఉన్నాయి. ఏలూరు జిల్లా డీసీపీయూ చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 నంబర్‌కు వచ్చిన సమాచారం మేరకు పెదపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో కొవ్వలిలో 14 ఏళ్ల బాలికకు మంగళవారం వివాహం చెయ్యడానికి ఏర్పాట్లు చేస్తున్నారనే సమాచారంతో అప్రమత్తమైన ఐసీడీఎస్ సిబ్బంది, పంచాయతీ, రెవెన్యూ అధికారులు, పోలీస్, సచివాలయం మహిళా కార్యదర్శి మంగళవారం బాలిక ఇంటికి వెళ్లి బాల్య వివాహం చట్టరీత్యా నేరం అని వివాహ ఏర్పాట్లను నిలుపుదల చేశారు. సదరు బాలికను అధికారులు ఏలూరు జిల్లా బాలల సంరక్షణ యూనిట్ కార్యాలయానికి తరలించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీబీ డాక్టర్ సీహెచ్ సూర్యచక్రవేణి బాలికకు, బాలిక తల్లిదండ్రుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాల్య వివాహం వలన కలిగే నష్టాలను వివరించారు. బాలికను సంరక్షణ నిమిత్తం వసతిగృహానికి తరలించారు. బాల్య వివాహాలపై చైల్డ్ హెల్ప్‌లైన్–1098కు సమాచారం ఇవ్వాలని కో–ఆర్డినేటర్ వైవీ రాజు కోరారు.

పేకాట శిబిరంపై మెరుపు దాడి

ముసునూరు: రమణక్కపేటలో పేకాట శిబిరంపై పోలీసులు మెరుపు దాడి చేశారు. పుల్లయ్య చెరువు సమీపంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై మంగళవారం దాడి చేసి, ముగ్గురిని అదుపులోనికి తీసుకుని, వారి నుంచి రూ.30 వేలు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.వాసు చెప్పారు.

ఎమ్మెల్యే విష్ణు బహిరంగ క్షమాపణ చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.జీవరత్నం

జంగారెడ్డిగూడెం: వ్యవసాయ కార్మికులను గ్రామీణ సోమరి పోతులు అని అవమానకర వ్యాఖ్యలు చేసిన విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణు కుమార్‌రాజు వారికి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షురాలు యాగంటి సీత సమావేశానికి అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎం.జీవరత్నం, సంఘం మండల కార్యదర్శి అందుగుల ప్రభాకర్‌రావు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ కూలీలు సోమరిపోతులుగా మారి పనులకు వెళ్లడం లేదని, అందువలనే ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయాలని జూన్ 29న విశాఖ జిల్లాలో వ్యవసాయ అధికారుల సమావేశంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు పట్టెడన్నం పెట్టే ఈ చట్టాన్ని తీసేయాలని ఎమ్మెల్యే వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. ఈ పథకానికి కేంద్ర బడ్జెట్లో రూ.రెండు లక్షల 50 వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం రూ.70 వేల కోట్లు కేటాయించి చేతులు దులుపుకుందని విమర్శించారు. తక్షణమే విష్ణు కుమార్ రాజు ఉపాధి కూలీలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో ఉపాధి కూలీలను ఐక్యం చేసి ఉద్యమం నిర్వహిస్తామని హెచ్చరించారు. కమిటీ సభ్యులు జోడే సూర్యచంద్రరావు, పిల్లి చంటి బత్తులవెంకన్న, వి.నరసింహ రావు, వబట్టా నాగరాజు. కె.సుబ్బారావు పాల్గొన్నారు.

ఆగస్టులో మార్టేరు శత వసంతోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

పెనుమంట్ర: మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం స్థాపించి ఈ ఏడాదితో శతాబ్దం కావడంతో ఆగస్టులో శతవసంతోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన విశ్వవిద్యాలయం సహ సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం మార్టేరు వరి పరిశోధన స్థానానికి వచ్చిన శాస్త్రవేత్తలు, బోధనేతర సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ టి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రానికి వరి పరిశోధనలలో అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టిన మార్టేరు వరి పరిశోధన స్థానం స్థాపించి వందేళ్లు పూర్తి చేసుకుంటుందని, ఈ సందర్భంగా ఆగస్టులో కర్టెన్ రైజర్ కార్యక్రమం ప్రారంభించి ఏప్రిల్ మొదటి పక్షంలో ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ టి.శ్రీనివాస్, మాజీ ఏడీఆర్ డి.శ్రీనివాస్, రైతులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య కేసులో నిందితుడికి నాలుగేళ్ల జైలు

ఏలూరు (టూటౌన్): వివాహిత ఆత్మహత్య చేసుకున్న కేసులో నిందితుడికి నాలుగేళ్ల జైలు శిక్షతో పాటు రూ.3 వేలు జరిమానా విధిస్తూ ఏలూరు ఐదో అదనపు జిల్లా జడ్జి, మహిళా కోర్టు జిల్లా న్యాయమూర్తి జి.రాజేశ్వరి మంగళవారం తీర్పు వెలువరించారు. ఈ కేసుకు సంబంధించి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీవీ రామాంజనేయులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం వేలివెన్ను గ్రామం కొత్తపేట అంబేడ్కర్ నగర్‌కు చెందిన సిర్రా లక్ష్మణరావు 2020, మార్చి 15న చర్చిలో ఉన్న వివాహితను బయటకు పిలిపించి అసభ్యంగా తిట్టి, కొట్టి ఉరివేసుకుని చచ్చిపోతే మంచిదని దూషించాడన్నారు. ఈ అవమానం తట్టుకోలేక ఆ వివాహిత తన పిల్లలు ఇద్దరినీ బయటకు పంపి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు ఆమెను ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందింది. దీనిపై మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు అప్పటి ఉండ్రాజవరం ఎస్సై ఎల్.అవినాష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసులో నిందితుడు సిర్రా లక్ష్మణరావుని అరెస్టు చేసి పూర్తి విచారణ అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సదరు కేసు విచారణలో నిందితుడి నేరం రుజువు కావడంతో అతడికి నాలుగేళ్ల జైలు శిక్షతో పాటు రూ.3వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి జి.రాజేశ్వరి తీర్పు చెప్పారని ఏపీపీ తెలిపారు.

కృష్ణా జిల్లాకు వంగవీటి రంగా పేరు పెట్టాలి

తణుకు టౌన్: రాష్ట్రంలో కాపు, కమ్మ మైత్రి నిలవాలంటే దివంగత ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగారావు స్మారకంగా మచిలీపట్టణం కేంద్రంగా ఉన్న కృష్ణా జిల్లాకు, విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆయన పేరును పెట్టాలని కాపు ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ రావి శ్రీనివాస్, కన్వీనర్ పెద్దిరెడ్డి మహేష్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా మంగళవారం తణుకులో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. గతంలో కొత్తగా జిల్లాల ఏర్పాటు చేసే సమయంలోనే బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు కృష్ణా జిల్లాకు వంగవీటి మోహనరంగారావు పేరు పెట్టాలని పార్లమెంట్‌లో ప్రస్తావించారని గుర్తు చేశారు. అంతేకాకుండా విజయవాడ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కూడా కృష్ణా జిల్లాకు మోహనరంగా పేరు పెట్టాలని పోరాటం చేశారన్నారు. ఈనెల 4న రంగా జయంతి సందర్భంగా ప్రభుత్వం ప్రకటించాలని కోరారు. కాపు ఐక్యవేదిక నాయకులు బోడపాటి పెదబాబు, పంచాది రంగారావు, నల్లజర్ల వెంకట రామారావు, కాకిలేటి హరనాథ్ పాల్గొన్నారు.

భార్యాభర్తలకు గాయాలు

ఉంగుటూరు: హైవేపై కారు ఢీకొనడంతో మోపెడ్‌పై వెళుతున్న భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. రాచూరుకు చెందిన భార్యాభర్తలు ఎం.పోతురాజు, చిన్నమ్మ మోపెడ్‌పై మంగళవారం తాడేపల్లిగూడెం వెళుతున్నారు. బాదంపూడి వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న కారు వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం తాడేపల్లిగూడెం తరలించారు.

క్లుప్తంగా

కృష్ణపరమాత్మకు పంచామృతాభిషేకాలు



కృష్ణపరమాత్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): జేష్ఠ బహుళ ఏకాదశి పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని రామచంద్రరావు పేటలోని కృష్ణ యోగధ్యాన మందిరంలోని కృష్ణపరమాత్మకు ఆలయ అర్చకులు ఆదూరి సాయిచే పంచామృత అభిషేకాలు, సహస్రనామార్చనలు జరిగాయి. సామూహిక భగవద్గీత, హనుమాన్ చాలీసా పారాయణంలు చేశారు. మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత షుగర్ రక్త పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో అధ్యక్షుడు వీవీఎస్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో దాత పసుమర్తి హనుమంతరావు (అనిల్) ఆర్థిక సహకారంతో కడకట్ల జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆస్పత్రిలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. శిబిరంలో 87 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పసుమర్తి చంద్రశేఖర్ శ్రీనివాసరావు, సుంకర శ్రీనివాసరావు, సెక్రటరీ చిన్నం జగదీష్, కోశాధికారి భీమవరపు మహాలక్ష్మి, డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, రామోహన్‌రావు, సూర్యనారాయణ మూర్తి, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వాసవీ హోమం

పెనుగొండ: అఖిల భారత శ్రీ వాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి థాంలో మంగళవారం వాసవీ హోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రాయచూర్, కల్యాణ దుర్గం, అనంతపురం పరిసర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలి వచ్చి మంగళవారం ఉదయం నుంచి గోమాత పూజ, వాసవీ మాతకు పంచామృతాభిషేకం, దంపతుల పూజ నిర్వహించారు. మరకత శిల వాసవీ మాతకు అర్చనలు నిర్వహించారు. అనంతరం ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు.

ఆక్వా మహాసభను విజయవంతం చేయండి

వీరవాసరం: పాలకొల్లులో నిర్వహిస్తున్న ఆక్వా మహాసభను విజయవంతం చేయాలని వీరవాసరం మండల ఫ్రాన్ ఫార్మర్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్ల రాంబాబు మంగళవారం పిలుపునిచ్చారు. రొయ్యల సాగులో రైతులు పడుతున్న ఇబ్బందులను, సమస్యలపై చర్చించడానికి సమావేశం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రొయ్యలకు ధరలు లేక పెరిగిన మేతలు, మందులు ధరల తాకిడితో రొయ్యల రైతులు ఆర్థికంగా చితికి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్క రొయ్యల రైతు తప్పనిసరిగా ఆక్వా రైతు మహాసభకు హాజరు కావాలని కోరారు.

ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆక్వా రైతుల సమస్యలపై ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆక్వా రైతులు రొయ్యలు, చేపలను కష్టపడి పండిస్తున్నారని తెలిపారు. ఆక్వా రైతుల కృషి వలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయం కూడా వస్తుందన్నారు. ఆక్వా రైతుల సమస్యలపై రైతాంగం చేసే ఉద్యమాలకు, పోరాటాలకు సీపీఎం పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని తెలిపారు.

మొబైల్ యాప్, వెబ్‌సైట్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపు

ఆకివీడు: ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చని విద్యుత్ శాఖ ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ కార్యాలయాల వద్దకు వెళ్లి చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. విద్యుత్ బిల్లులు చెల్లించేటప్పుడు ఏపీఈపీడీసీఎల్ పేరు కన్పించదన్నారు. సంస్థ మొబైల్ యాప్ ఈస్టర్న్ పవర్‌ని గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. సంస్థ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఈస్ట్రన్‌పవర్.కామ్ నుంచి బిల్లులు చెల్లించొచ్చని సూచించినట్లు అహ్మద్ ఖాన్ తెలిపారు. వినియోగదారులు ఫోన్‌పే, జీపే, పేటీఎం, ఇతర యాప్స్‌తో పాటు డెబిట్, కార్డులు కూడా వాడుకోవచ్చని వివరించారు.

ఒంటికి వ్యాయామం మంచిదేగా

- ముని్సపాలిటీలో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు
- ఓపెన్ జిమ్‌లలో మహిళలే అధికశాతం
- శారీరక దృఢత్వంపై పెరిగిన అవగాహన
- ఆనందం వ్యక్తం చేస్తున్న పట్టణ వాసులు



తణుకు బ్యాంక్ కాలనీలోని పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్



వ్యాయామం చేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్ : వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చుతున్నారు. వివిధ పద్ధతుల్లో వ్యాయామం చేస్తున్నారు. అయితే వ్యాయామం చేయడానికి ప్రైవేటు జిమ్‌లో చేరాలంటే అధిక మొత్తంలో నెలవారి నగదు చెల్లించాలి. అటువంటి ఇబ్బందులు లేకుండా చక్కనైన, ఉచిత ఓపెన్ జిమ్‌లను మున్సిపాల్టీ అధికారులు ఏర్పాటు చేశారు. తణుకులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు వ్యాయామ ప్రక్రియకు దోహదపడుతున్నాయి. ఓపెన్ జిమ్‌లు ఆరోగ్యకరమైన శారీరక వ్యాయామాన్ని అందిస్తున్నాయి. అధిక శాతం మహిళలే ఈ ఓపెన్ జిమ్‌లకు వచ్చి వివిధ పరికరాల ద్వారా వ్యాయామాన్ని చేస్తున్నారు. తణుకులో శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలోను, బ్యాంక్ కాలనీ, ఎన్జీవోస్ కాలనీ, సజ్జాపురం, న్యూ బ్యాంక్ కాలనీ, ఎన్జీవోస్ కాలనీ పార్కులతోపాటు హౌసింగ్ బోర్డు కాలనీలోని వైఎస్సార్ పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లలో అత్యంత ఖరీదైన అధునాతన వ్యాయామ పరికరాలను అందుబాటులో ఉంచారు. ముఖ్యంగా శ్రీచిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో వాకింగ్ కోసం వచ్చే వారంతా వాకింగ్ అనంతరం ఓపెన్ జిమ్‌లోని అన్ని పరికరాలపైనా వ్యాయామం చేసి వెళ్తున్నారు. ఇక పార్కుల్లో అయితే ఉదయం, సాయంత్రం కూడా చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వ్యాయామం చేస్తున్నారు.

అధునాతన పరికరాలు..

శరీరంలోని ప్రతి అవయవంపైనా ఒత్తిడి తెచ్చే విధంగా అధునాతన పరికరాలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా అవయవాలన్నీ స్పందించే విధంగా శరీరంలో పేరుకుపోయిన కొవ్వు శాతాన్ని కరిగించే వ్యాయామ ప్రక్రియలున్న పరికరాలను ప్రత్యేకంగా డిజైన్ చేయించి అమర్చారు. దీంతో మహిళలు సాయంత్రం సమయంలో ఈ ఓపెన్ జిమ్‌ల్లో ఉల్లాసంగా గడుపుతున్నారు.

ఓపెన్ జిమ్‌లు బాగున్నాయి



తణుకు పట్టణంలోని పార్కుల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు చాలా బాగున్నాయి. ప్రతి పార్కులోను మహిళలే అధికశాతం ఓపెన్ జిమ్‌లలోని సైక్లింగ్, అప్ అండ్ డౌన్ పరికరాలతోపాటు ఇతర వ్యాయామాలు చేసేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. సాయంత్రం అయితే చాలు మహిళలంతా స్థానికంగా ఉండే పార్కుల్లోని ఓపెన్ జిమ్‌లకు సమయం కేటాయిస్తున్నారు.

– వి.వెంకట సత్యవతి, తణుకు

ఆచంటకు తణుకు మీదుగా బస్సులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తణుకు రైల్వే ఇంజనీర్ ఆదేశాలు మేరకు ఈ నెల 3వ తేదీ బుధవారం నుంచి 5వ తేదీ శుక్రవారం వరకు అత్తిలి–మంచిలి రైల్వే లైన్ మరమ్మతులు నిమిత్తం మంచిలి రైల్వే గేటు మూసివేస్తున్నట్లు ఇచ్చిన సమాచారం మేరకు తాడేపల్లిగూడెం డిపో నుంచి అత్తిలికి ప్రతి రోజు ఉదయం 5.30 గంటల నుంచి ప్రతి రెండు గంటలకు ఒక బస్సు ఉన్నట్లు తెలిపారు. అదే విధంగా ఆచంటకు తణుకు మీదుగా బస్సులు నడుపుతున్నట్లు, మార్పును గమనించాలని డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం జీఐఎస్ విద్యుత్ ఉపకేంద్రం వార్షిక నిర్వహణ పనుల నిమిత్తం 3వ తేది బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పట్టణంలో బుధవరం మార్కెట్, మెంటేవారి తోట, శ్రీనివాస సెంటర్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, గులాబీ సెంటర్, మారుతి టాకీస్, బస్టాండ్ ఏరియా, రిలయన్స్ సూపర్ మార్కెట్, కళాభవన్ ప్రాంతం పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈ.ఈ) పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాడి పశువుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి



పట్టింపాలెం గ్రామంలో ఆవులకు చర్మ వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న దృశ్యం



కె. పెంటపాడు గోశాలలో ఆవులకు టీకాలు వేస్తున్న మండల పశువైద్యాధికారి మహేష్

తాడేపల్లిగూడెం రూరల్: పాడి పశువుల ఆరోగ్యం పట్ల రైతులు శ్రద్ధ వహించాలని పట్టింపాలెం సర్పంచ్ బొనిగే పోతన అన్నారు. మంగళవారం మండలంలోని పట్టింపాలెం గ్రామంలో ఆవులకు ముద్ద చర్మ రోగం నివారణకు ముందస్తు టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పోతన మాట్లాడుతూ సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముందస్తుగా టీకాలు చేయించడం వల్ల పాడి పశువులను సంరక్షించుకోవచ్చన్నారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ టీవీ.విజయ్ కుమార్ మాట్లాడుతూ అన్ని రైతు భరోసా కేంద్రాలు, పశువైద్యశాలల్లో ఆవులకు ముద్ద చర్మ రోగం నివారణ టీకాలు, గొర్రెలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్టు తెలిపారు. రైతులందరూ తమ పశువులకు టీకాలు వేయించాలన్నారు. గ్రామంలో 93 పాడి పశువులకు టీకాలు వేశారు. అలాగే ఆరుగొలను గ్రామంలోనూ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ పీతల బుచ్చిబాబు ప్రారంభించారు. ఆరుగొలను పశువైద్యాధికారి డాక్టర్ టి.దివ్యశ్రీ మాట్లాడుతూ పాడి రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆరుగొలనులో 48, కొత్తూరులో 43 పాడి పశువులకు టీకాలు వేసినట్లు వివరించారు. పాడి రైతులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ముద్ద చర్మ వ్యాధికి వ్యాక్సిన్

పెంటపాడు: ఆవులలో వచ్చే ముద్ద చర్మ వ్యాధి (లంపీ స్కిన్ డీసీజ్)కి ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వ్యాక్సిన్ వేస్తామని మండల పశువైద్యాధికారి డాక్టర్ మహేష్ పేర్కొన్నారు. డివిజన్ పశుసంవర్ధక శాఖ డీడీ డాక్టర్ కేఎల్ సుధాకర్ ఆధ్వర్యంలో మంగళవారం ముద్దచర్మ వ్యాధినివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పాడిరైతులకు పలు సూచనలు చేశారు. 4 నెలల ఆవు దూడ నుంచి ప్రతీ పశువుకూ ఇంటింటికీ వచ్చి వ్యాక్సిన్ వేస్తామని చెప్పారు. ఇది వైరల్ వ్యాధి అని, ఈ వ్యాధి సోకిన పశువు తీవ్ర జ్వరం, చర్మంపై పెద్ద పెద్ద బొడుపులు వస్తాయన్నారు. తరువాత అవి పగిలి గాయాలుగా మారి రక్తం కారుతుందన్నారు. కాళ్లు వాచి నడవ లేదని, పాల దిగుబడి తగ్గిపోతుందని, మేత తినకుండా కొన్ని సందర్భాల్లో పశువు చనిపోతుందని తెలిపారు. గొర్రెల పెంపకం దారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జులై 6న జునోసిస్ డే పురస్కరించుకొని వీధి కుక్కలకు పెంపుడు కుక్కలను యాంటీ రాబిస్ టీకాలు వేయనున్నట్లు మహేష్ తెలిపారు. వివరాలకు మండల పశువైద్యాధికారిని సంప్రదించాలన్నారు.

మొక్కల పెంపకంతోనే భూమాతకు రక్ష



తణుకులో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

తణుకు టౌన్: పర్యావరణ పరిక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని జిల్లా బీజేపీ అధ్యక్షుడు నార్ని తాతాజీ కోరారు. మంగళవారం తణుకులో బీజేపీ ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదానం దినోత్సవం సందర్భంగా ప్రతీ సంవత్సరం జూలై 2 నుంచి 7వ తేదీ వరకూ నిర్వహించే మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా తణుకులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ తల్లుల పేరుతో మొక్కలు నాటి పెంచడం ద్వారా భూమాతను రక్షించగలమని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు పార్టీ కార్యకర్తలు, నాయకులు మొక్కలను విరివిగా నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షుడు పెదమల్లు అవినాషత్ కాంత్, ప్రధాన కార్యదర్శి బొల్లాడ నాగరాజు, రేపాక సూర్యరామారావు, ఉపాధ్యక్షుడు రాసాబత్తుల అనుకుమార్, మణిదీప్, గంటా శరత్, వీరబాబు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేద్దామని బీజేపీ నాయకులు అసెంబ్లీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, నరిశే సోమేశ్వరరావులు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలో మొక్కలు నాటారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నిల్వ ఆహారాన్ని తీసుకోరాదు



వెంకట్రామన్నగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ఇంటిలో నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తినరాదని వెంకట్రామన్నగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి జి.రూపాదేవి అన్నారు. మంగళవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ పరిధి గ్రామాల్లో స్టాప్ డయేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రూపాదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్లోరినేషన్ చేసిన నీటిని తాగాలని, కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలని సూచించారు. నీళ్ల విరోచనాల లక్షణాలు ఉంటే దగ్గరలోని అంగన్‌వాడీ కేంద్రాలను సంప్రదించాలన్నారు. అక్కడ అందించే ఓఆర్ఎస్, జింక్ మాత్రలు ద్వారా నీళ్ల విరోచనాలను నివారించవచ్చన్నారు. గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులను క్రమం తప్పకుండా పరిశుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సూర్యకాంతం, హెచ్‌వీ జ్యోతిర్మయి, హెచ్ఎస్ లక్ష్మణ్, ఫార్మాసిస్ట్ రామారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జి.బేబి, డి.ఎస్తేరు రాణి, హెల్త్ అసిస్టెంట్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు: ఎన్నికలకు ముందు పింఛన్‌దారులకు ఇచ్చిన మాట అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక ఉమ్మడి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సచివాలయ సిబ్బందితో పింఛన్లు పంపిణీ సాధ్యం కాదని గత ప్రభుత్వం భావించినప్పటికీ వలంటీర్లతో సంబంధం లేకుండా పింఛన్లు పంపిణీ చేశామన్నారు. తణుకు నియోజకవర్గంలో దాదాపు 38 వేల ఫింఛన్లు అందజేసి ఒక్కరోజులోనే 97 శాతం మేర పూర్తి చేయగలిగామని వెల్లడించారు. వలంటీర్ల వ్యవస్థపై ప్రభుత్వం పునరాలోచిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ దొమ్మేటి వెంకటసుధాకర్, పితాని మోహన్‌రావు, ఆనాల ఆదినారాయణ, కొమ్మిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రైస్తవుల సమస్యలు పరిష్కారిస్తా

తణుకు టౌన్: తణుకు నియోజకవర్గంలో క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కారిస్తానని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చెప్పారు. మంగళవారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని ఏసు సేవా కేంద్రంలో నిర్వహించిన ఇండియన్ క్రిస్టియన్ డే సందర్భంగా జరిగిన ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మండల యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓ మనోజ్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో ఇటీవల ఎన్నికలలో తణుకు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆరిమిల్లి రాధాకృష్ణను పాస్టర్లు సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో క్రైస్తవులు ఎదుర్కొంటున్న స్మశాన వాటిక సమస్యలను పరిస్కరిస్తారని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జోసఫ్ ఎడ్వర్డ్ వాక్య సందేశం అందించారు. కార్యక్రమంలో పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు ఎంజే ప్రేమ్‌కుమార్, అసోసియేషన్ కార్యదర్శి బ్లెస్సింగ్ రాజు, కోశాధికారి డేవిడ్ బాబు, ఏసు సేవా కేంద్రం అధ్యక్షుడు ఇజ్రాయేలు, మండలంలోని పాస్టర్లు పాల్గొన్నారు.

కాలువల నిర్వహణ నిధికి ఎంపీపీ విరాళం

పాలకోడేరు: ఉండి నియోజకవర్గంలో పంట కాలువలు, డ్రైనేజీ నిర్వహణ నిధికి భూపతిరాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు) రూ.లక్ష విరాళం ప్రకటించారు. మంగళవారం పాలకోడేరు సొసైటీలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో విరాళం చెక్కును ఆయన ఎమ్మెల్యే కనుమూరు రఘు రామ కృష్ణరాజుకు అందజేశారు.

డయేరియా సోకకుండా జాగ్రత్తలు పాటించాలి



రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డి మహేశ్వరరావు

అత్తిలి: డయేరియా వ్యాధి సోకకుండా ఆరోగ్యకేంద్రాల సిబ్బంది, ఆశా వర్కర్స్ ప్రతి బిడ్డకు రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డి మహేశ్వరరావు కోరారు. మంగళవారం అత్తిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో డయేరియా వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మహేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని తెలిపారు. ఎక్కువ సార్లు నీళ్ల విరేచనాలు, వాంతులు అవుతుంటే ఓఆర్ఎస్ ప్యాకెట్లు , జింక్ ట్యాబ్లెట్స్ అందజేయాలని కోరారు. వ్యాధి లక్షణాలు ఉంటే ఆరోగ్యకేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. ఈ సందర్భంగా రక్షిత మంచినీటి పథకాల క్లోరినేషన్‌ను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె నాగరాజు, సిహెచ్‌ఓ ప్రమీలాదేవి. ఆశ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

పాలకొల్లు అర్బన్: స్థానిక రోటరీ క్లబ్ 2024–25 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గ సభ్యులను రోటరీ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్, క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ పెనుమాక రామమోహనరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఉల్లంపర్రుకి చెందిన రావాడ సతీష్, కార్యదర్శిగా జవ్వాజి కల్యాణ్, కోశాధికారిగా పోతాబత్తుల సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు రావాడ సతీష్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ సేవా సంస్థ ద్వారా ఏడాది కాలం తమకు సేవ చేసే అవకాశం కల్పించిన రోటరీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించి ఆదర్శ క్లబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో మద్దాల శ్రీనివాస్, మద్దాల రాంప్రసాద్, కఠారి నాగేంద్ర కుమార్, ఇమ్మిడి రాజేష్, కావలి నగేష్, మైగాపుల రాంబాబు, గన్నాబత్తుల శ్రీనివాస్, పలివెల శివ, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ రక్షణ

నరసాపురం: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, వాటి పెంపకం ఆవశ్యకతను ప్రతీ ఒక్కరూ గుర్తించాలని వైఎన్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు సూచించారు. మంగళవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో వన మహోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కనకారావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకమే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్ గంధం శ్రీరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు అర్బన్: అమ్మ పేరుతో మొక్క నాటండి పర్యావరణాన్ని పరిరక్షించండంటూ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు కొంతేరులో బీజేపీ కృష్ణా జిల్లా ఇన్‌చార్జ్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఉన్నమట్ల కబర్ధి మంగళవారం మొక్క నాటారు.

కొండెక్కిన ‘కూరగాయలు’

- టమాటా, పచ్చిమిర్చి పైపైకి
- చుక్కల్లో నిత్యావసరాల ధరలు
- వినియోగదారుల ఆందోళన



మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న కూరగాయలు

తణుకు: రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు ఇప్పుడు కూరగాయల ధరలు తోడయ్యాయి. అమాంతంగా పెరిగిన కూరగాయల ధరలతో పేద, మధ్య తరగతి కొనలేక అవస్థలు పడుతున్నారు. ఏం కొనాలన్నా కిలో రూ. 60లు పైమాటే. టమాట పులుపెక్కితే.. మిర్చి ఘాటెక్కింది. కాకర మరింత చేదెక్కింది. రోజుల వ్యవధిలోనే ధరలు అమాంతం పెరగడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కూరగాయలు కొండెక్కి కూర్చున్నాయి. దీంతో సామాన్య ప్రజలు ఏమీ కొనలేం.. తినలేమంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిన్న, మొన్నటి వరకు ఓ మోస్తరులో ఉండే ధరలు నేడు చుక్కలనంటుతున్నాయి. మార్కెట్‌కు వెళ్లి కూరగాయల ధరలు చూస్తే సామాన్యుల గుండె బరువెక్కిపోతోంది.

రెండింతలు పెరిగిన ధరలు...

నిత్యం కూరల్లో వినియోగించే కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. కిలోలల్లో కొనుగోలు చేసేవారు సైతం ప్రస్తుతం పెరిగిన ధరలకు పావు, అరకిలో కొనుగోలు చేస్తూ సరిపెట్టుకుంటున్నారు. ప్రస్తుతం తణుకు మార్కెట్‌లో కూరగాయల ధరలు ఒక్కసారిగా రెండింతలు పెరగడంతో ఏమీ కొనలేకపోతున్నామని వినియోగదారులు వాపోతున్నారు. మరోవైపు పప్పు దినుసుల ధరలు కూడా భగ్గుమంటున్నాయి. ఏ కూరగాయలు కొనుగోలు చేయాలన్నా కిలో రూ. 60 పైమాటే పలుకుతున్నాయి. ఎండాకాలం పేరుతో మరింత ధరలు పెంచి విక్రయిస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా 70 శాతం మంది రైతులు కూరగాయల సాగు చేపట్టలేదు. వంటింట్లో ఎలాంటి వంటకాలు చేయాలన్నా టమోటా, పచ్చిమిర్చి, ఉల్లిగడ్డలు తప్పనిసరిగా ఉండాలి. రోజువారి వాడకంలో వీటి పాత్ర చాలా కీలకం. వీటిలో మిర్చి ధర ఘాటెక్కిస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో పచ్చిమిర్చి రూ. 80 పలుకుతోంది. కిలో టమోటా రూ. 60, క్యారెట్, రూ. 60, వంకాయలు రూ. 60, చిక్కుళ్లు రూ. 80, బీట్‌రూట్, బెండ, బీన్స్ ధరలు రూ. 100 పైగా ధరలు పలుకుతున్నాయి. సామాన్య ప్రజలకు పెరిగిన కూరగాయల ధరలు భారంగా మారాయి.